పేదల పక్షపాతి కాంగ్రెస్: ఎంపీ అనిల్‌కుమార్


ఎంపీ అనిల్‌కు పూలబొకే అందజేస్తున్న నాగభూషణం

ముషీరాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అని ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు మురళీ మోజెస్ బుధవారం ఎంపీ అనిల్‌కుమార్‌ను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముషీరాబాద్ నియోజకవర్గంలో చేపడుతున్న పార్టీ కార్యక్రమాలను ఎంపీకి ఆయన వివరించారు. అనంతరం ఎంపీ అనిల్ మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి అంకిత భావంతో పనిచేస్తున్నారన్నారు. కాంగ్రెస్‌కు రోజురోజుకు ప్రజల్లో ఆదరణ పెరుగుతున్నదని ఎంపీ పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీలో కష్టపడిన వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందని చెప్పారు. అనంతరం అనిల్‌కుమార్ యాదవ్‌ను మురళీమోజేస్ సన్మానించారు.

రాంనగర్: రాజ్యసభ ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ జన్మదినం సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగభూషణం బుధవారం ఆయన నివాసంలో కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎస్టీల మధ్య గొడవ పెట్టే కుట్రను మానుకోవాలి

● ఎస్టీ లంబాడి విద్యార్థులు

చిక్కడపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్టీల మధ్య గొడవ పెట్టే కుట్రను ప్రభుత్వం మానుకోవాలని పలువురు ఎస్టీ లంబాడి విద్యార్థులు డిమాండ్ చేశారు. చిక్కడపల్లి సిటిసెంట్రల్ లైబ్రరీలో ఎస్టీ లంబాడి విద్యార్థులు శంకర్‌నాయక్, శ్రీనివాస్‌నాయక్, నరసింహ నాయక్, రవినాయక్‌లు బుధవారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మాజీ ఎంపీ సోయం బాపురావు లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారన్నారు. వారు పిటిషన్ వేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి కారణమని, లంబాడిలను గిరిజన తెగ నుంచి తొలగించాలని కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా లంబాడిలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే చర్యలను మానుకోవాలని హితవు పలికారు.


మాట్లాడుతున్న టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిబాబా

రైతులకు యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలం

● టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిబాబా

రాంనగర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సకాలంలో రైతుకు యూరియా అందించడంలో రాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సాయిబాబా ఆరోపించారు. బుధవారం పార్టీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం యూరియా లేదంటూ చేతులెత్తేసిందని ఆరోపించారు. అదును దాటుతున్న రైతులకు యూరియా అందించకపోవడం ప్రభుత్వ చాతగాని తనానికి నిదర్శనమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే రైతులకు యూరియా అందించడంపై దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నగర ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.గౌతమ్‌రావు

17 నుంచి సేవా కార్యక్రమాలు

● బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. గౌతమ్‌రావు

బర్కత్‌పుర, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు రాష్ట్ర వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. గౌతమ్‌రావు తెలిపారు. బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో బుధవారం సేవాపక్షం సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, మోదీ సారథ్యంలో భారత్ అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తూ ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదిగిందని ఆయన కొనియాడారు. రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛ భారత్, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 17 రోజుల పాటు జరిగే సేవా కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్‌రాథోడ్, కార్పొరేటర్ ఉమాదేవి, బీజేపీ నేతలు బంగారు శ్రుతి, కల్యాణ్‌బుద్ధం మహిపాల్‌రెడ్డి, రమేష్‌యాదవ్, అజయ్‌కుమార్, సూర్యప్రకాష్‌సింగ్, శ్యామ్‌రాజ్ ముదిరాజ్, శ్రీధర్, రవీందర్ పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి చొరవతోనే రోడ్డు మరమ్మతు పనులు

అంబర్‌పేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చొరవతో బుధవారం ఎంసీహెచ్ కాలనీలో రోడ్డు మరమ్మతు పనులు అధికారులు పూర్తి చేశారు. అయిదు సంవత్సరాలుగా ఎంసీహెచ్ కాలనీలో బంగారు తోట మైసమ్మ దేవాలయం వద్ద నడవడానికి ఇబ్బందిగా ఉండడం, వర్షం నీరు నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీనిపై బీజేపీ సెంట్రల్ జిల్లా కౌన్సిల్ సభ్యులు దాసోజు నాగభూషణంచారి సమస్యను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కిషన్‌రెడ్డి వెంటనే జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడి రోడ్డు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో అధికారులు ఎంసీహెచ్ కాలనీలో రోడ్డు పనులు పూర్తి చేసి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో రత్నప్రభ, రామకృష్ణ, సురేందర్, వీరేష్, రజని, చందు, సాయి తదితరులు పాల్గొన్నారు.


శివశంకర్‌కు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు సురేష్‌కుమార్

పార్కింగ్ సమస్య లేకుండా చూడాలి: సురేశ్

ముషీరాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆలయానికి వచ్చే భక్తులకు పార్కింగ్ సమస్య రాకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని భవానీ శంకర ఆలయ కమిటీ అధ్యక్షుడు మేడి సురేశ్‌కుమార్ సూచించారు. భోలక్‌పూర్ డివిజన్ దేవునితోటలో ప్రసిద్ధిగాంచిన భవానీశంకర ఆలయ ప్రాంగణంలో వాహనాల పార్కింగ్ టెండర్‌ను బుధవారం స్థానికుడు ఎన్‌ఎన్ శివశంకర్ రూ.3.85లక్షలకు వేలం పాటలో దక్కించుకున్నారు. ఈ సందర్భంగా శివశంకర్‌కు సురేశ్‌కుమార్ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. అనంతరం సురేశ్ మాట్లాడుతూ, ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలన్నారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అండాలు, ఆలయ ధర్మకర్తలు రాజు, సాయిబాబా పాల్గొన్నారు.


ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, వీర్లపల్లి శంకర్


టీజేఎస్ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కోదండరాం


కవాడిగూడలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఎస్పీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కమల్


ఎస్‌వీకే వద్ద చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్‌వీకే కార్యదర్శి వినయ్‌కుమార్

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

● పలువురు వక్తలు

కవాడిగూడ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు అన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రజక అభివృద్ధి సంస్థ గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ నర్సింహ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 40వ వర్ధంతిని లోయర్ ట్యాంక్‌బండ్‌లో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, షాదనగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా నాయకురాలు ఇందిరాశోభన్, రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ మందలపు గాంధీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపల్లి రాజశేఖర్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ముఠాజైసింహులు హాజరై నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి హరినాథ్, చుక్కయ్య, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శులు చంద్రమోహన్, కిషన్, శ్రీధర్, సుధాకర్, గ్రేటర్ వైస్ చైర్మన్ అశోక్, రమేశ్, వివిధ దోబిఘాట్ల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లైబ్రరీ చైర్మన్, ఉద్యోగులు

ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో..

చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో కవాడిగూడ భాగ్యలక్ష్మీనగర్‌లో ఆమె చిత్ర పటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఎస్పీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కమల్, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కో కన్వీనర్ వినోద్‌యాదవ్, డీఎస్పీ ముషీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి సంతోష్‌కుమార్, ఎరుకల సంఘం అధ్యక్షుడు ముత్యాలు, గౌడ సంఘం, రజక వృత్తి దారుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్: తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ అని మాజీ ఎమ్మెల్సీ కోదండరాం అని అన్నారు. ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం తెలంగాణ జన సమితి కార్యాలయంలో ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద చాకలి ఐలమ్మ చిత్ర పటానికి ఎస్‌వీకే కార్యదర్శి వినయ్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు.


ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకుడు కేపీ మురళీకృష్ణ తదితరులు

చిక్కడపల్లి: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, రజాకార్లను ఎదురించిన ధీశాలి చాకలి ఐలమ్మ అని సిటీ సెంట్రల్ లైబ్రరీ చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి ఉపేందర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఐలమ్మను నేటి మహిళలు స్ఫూర్తిగా తీసుకుని అన్ని రంగాల్లో రాణించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగులు చంద్రకళ, వెంకటేశ్వర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మహేందర్, వరప్రసాద్, మహేష్, ముత్యం, అమరావతి, భాగ్య, మహేశ్వరి, సునీత, సుగ్రీవ తదితరులు పాల్గొన్నారు.

బర్కత్‌పుర: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరవనిత చాకలి ఐలమ్మ పోరాట పటిమను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కేపీ మురళీకృష్ణ పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా బర్కత్‌పుర చౌరస్తా వద్ద ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకురాలు విజితారెడ్డి, నాయకులు లింగం, లాలయ్యగౌడ్, నందుముదిరాజ్, రాజేష్‌లాల్, వినయ్‌రాజు, కిరణ్, సుధాకర్, రవి, అశోక్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి పనులు

● ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

రాంనగర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా ముషీరాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నాయని ఆయన ఆరోపించారు. చిక్కడపల్లిలోని స్ట్రీట్ నంబర్ 10, సోప్ ఫ్యాక్టరీ వీధి, బృందావన్ కాలనీ తదితర ప్రాంతాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం ఎమ్మెల్యే పరిశీలించి మాట్లాడారు. అభివృద్ధి పనుల నిర్వహణలో అధికారులు నాణ్యతాప్రమాణాలు పాటించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, రాంనగర్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శంకర్ ముదిరాజ్, మన్నె దామోదర్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోపాల్, జైసింహ

ఎమ్మెల్యేను కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు..

ముషీరాబాద్: బీఆర్‌ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డితో కలిసి పార్టీ సీనియర్ నాయకుడు పూస గోరక్‌నాథ్ బుధవారం ఎమ్మెల్యే ముఠాగోపాల్‌ను కలిశారు. ఈ సందర్భంగా ముషీరాబాద్‌లోని సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సరోజ, చందు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.1.17 లక్షలు

చిక్కడపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,17,188 వచ్చినట్లు ఆలయ ఈఓ మాచర్ల దేవనాథం, ఆలయ రెనోవేషన్ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్ తెలిపారు. బుధవారం ఆలయ హుండీని లెక్కించారు. ఆలయ హుండీ ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని వారు చెప్పారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ ఆలయ కమిటీ సభ్యులు నేతి శ్యామ్ కుమార్, గణేశ్, నిర్మల, రామకృష్ణ, గాంధీ, హరీష్, సీతారాణి, లక్ష్మీనారాయణరావు, సుబ్బారావు, బాలకుమార్, నవీన్‌ప్రసాద్, శశి కుమార్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ్‌నగర్ అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే


బస్తీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేష్

అంబర్‌పేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రేమ్‌నగర్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. ప్రేమ్‌నగర్‌లో కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే బుధవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా బస్తీవాసుల సమస్యలు తెలుసుకున్నారు. కలుషిత నీటి సమస్యపై స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే జలమండలి అధికారులను పిలిపించి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. డ్రైనేజీ, వీధి దీపాలు, ఇతర సమస్యలను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. సొంత నిధులతో నూతన బోరు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు సిద్దార్థముదిరాజ్, నాయకులు మహేష్‌ముదిరాజ్, నాగరాజు పాల్గొన్నారు.

రాంనగర్ డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి

● కార్పొరేటర్ రవిచారి

రాంనగర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ రవిచారి తెలిపారు. డివిజన్‌లోని చిక్కడపల్లి సోప్ ఫ్యాక్టరీ వీధిలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతగా, సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు శ్రీనివాస్, స్థానికులు పాల్గొన్నారు.

మెగా చాంపియన్ షిప్‌లో విద్యార్థుల ప్రతిభ

రాంనగర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో నగరంలోని ఆర్‌జీకేడీయూ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన యూనివర్సిటీ ఇంటర్ కాలేజెస్ మెగా చాంపియన్ షిప్ పోటీలలో బాగ్‌లింగంపల్లికి చెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. కళాశాల నుంచి 10 టీమ్‌లు పాల్గొనగా.. రాహుల్, శ్రావణ్, సురేష్, రియాజ్‌లు పలు క్రీడల్లో విజేతలుగా నిలిచి కళాశాలకు పతకాలు తీసుకువచ్చారు. బుధవారం విజేతలను కళాశాల కరస్పాండెంట్ డా.సరోజావివేక్, సీఈఓ లింబాద్రి, డైరెక్టర్ యాదగిరి అభినందించారు.

విద్య, వైద్య దోపిడీని అరికట్టాలి: వక్తలు

● ఎస్‌వీకేలో రౌండ్ టేబుల్ సమావేశం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ. నాగేశ్వరరావు

రాంనగర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్య, వైద్య రంగంలో దోపిడీని అరికట్టాలని, అందుకు ప్రభుత్వాన్ని చట్టాలను కఠినంగా అమలు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ఏఐఎఫ్‌డీవై ఆధ్వర్యంలో మద్దికాయల ఓంకార్ శత జయంతి వార్షికోత్సవంలో భాగంగా విద్య, వైద్యం ప్రభుత్వ రంగంలో కొనసాగించాలి అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఓయూ ఆర్ట్స్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కొండా నాగేశ్వరరావు మాట్లాడుతూ, అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రజలకు ఉచితంగా విద్య, వైద్య సదుపాయాలు కల్పిస్తున్నారని గుర్తు చేశారు. బీజేపీ ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా పాలన సాగిస్తుందన్నారు. విద్యను కాషాయీకరణ చేసేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఏఐఎఫ్‌డీఐ జాతీయ సహాయ కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం మద్దికాయల ఓంకార్ చట్టసభలలో తన గొంతు ద్వారా పోరాటం చేశారని అన్నారు. సమావేశంలో ఏఐఎఫ్‌డీఐ రాష్ట్ర అధ్యక్షుడు రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఏఐఎఫ్‌డీవై రాష్ట్ర అధ్యక్షుడు మురళీ, ఏఐఎఫ్‌డీ, ఏఐఎఫ్‌డీవై నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాజశేఖర్ తదితరులు

చిక్కడపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ)లో దివ్యాంగ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు తప్పనిసరిగా అమలు చేయాలని యూబీఐ డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం న్యూఢిల్లీలోని భారత ప్రభుత్వ సామాజిక న్యాయమంత్రిత్వ శాఖ పరిధిలో ఉన్న ప్రధాన దివ్యాంగుల కమిషనర్ గోవిందరాజుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆర్‌పీడబ్ల్యూడీ చట్టం 2016 సెక్షన్ 33 ప్రకారం దివ్యాంగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయడం తప్పనిసరి అని అన్నారు. యూబీఐ సహా పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్లో మూడు సంవత్సరాలుగా ఒక్క దివ్యాంగ ఉద్యోగి కూడా పదోన్నతి పొందలేదని, వెంటనే బ్యాక్‌లాగ్ ఖాళీలను గుర్తించి భర్తీ చేయాలని కోరారు. వైకల్య అవగాహన దినోత్సవాలను బ్యాంకు అధికారిక క్యాలెండర్‌లో చేర్చాలని రాజశేఖర్ కోరారు. సమస్యల పరిష్కారానికి కమిషనర్ గోవిందరాజు స్పందించారని, త్వరలోనే పరిష్కరిస్తానని హామీనిచ్చారని రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్, వర్కింగ్ అధ్యక్షుడు స్వామినాయక్, ఉపాధ్యక్షుడు గణేష్‌రెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ అమిత్‌కుమార్ పాండే తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన తేజాగౌడ్



ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు తేజాగౌడ్ బుధవారం కలిశారు. ఈ సందర్భంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలుకు కృషి చేస్తున్న సీఎంకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

- రాంనగర్ (ఆంధ్రజ్యోతి)



ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న గ్రూప్-1 అభ్యర్థులు

గ్రూప్-1 పరీక్షలను మళ్లీ నిర్వహించాలి: అభ్యర్థులు

చిక్కడపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలు మళ్లీ నిర్వహించాలని నిరుద్యోగ అభ్యర్థులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెయిన్స్ పరీక్షపై హైకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల అభ్యర్థులు హర్షం ప్రకటించారు. ఈ మేరకు బుధవారం అశోక్‌నగర్ చౌరస్తాలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. గ్రూప్-1 ఫలితాలపై హైకోర్టు తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి, టీజీపీఎస్సీకి చెంపపెట్టులాంటిదని అన్నారు. టీజీపీఎస్సీ డివిజన్ బెంచ్‌కు వెళ్లాలనే నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని కోరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం చేసే జీవో నంబర్ 29ను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. గ్రూప్-1పై కోర్టు తీర్పును దృష్టిలో పెట్టుకుని గ్రూప్-2, గ్రూప్-3లకు ఎంపికైన వారికి అపాయింట్‌మెంట్ ఆర్డర్లను ఆపాలన్నారు. నిరుద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. స్థానిక ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు నరసింహ, నాగరాజు, దామోదర్, ఇంద్రనాయక్, రవికుమార్, విక్రమ్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.


బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన డా.శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న పార్టీ రాష్ట్ర, నగర నాయకులు

బీజేపీ రాష్ట్ర నేతలకు సన్మానం

రాంనగర్/ అంబర్‌పేట/ గోల్నాక, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డా.గౌతమ్‌రావు, కార్యదర్శిగా డా. శ్రీనివాస్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా ఆనంద్‌గౌడ్‌లు ఎన్నికయ్యారు. వారిని బుధవారం బీజేపీ రాంనగర్, అంబర్‌పేట, గోల్నాక డివిజన్ నేతలు వేర్వేరుగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అంబర్‌పేట నేతలు నరేష్‌గౌడ్, నాగభూషణంచారి, రాజు, భిక్షపతి, కృష్ణ ముదిరాజ్, యశ్వంత్, రాంచందర్‌గుప్తా, పెంటంరాజు, యాదగిరి, భాస్కర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ చంద్రమౌళి, నర్సింగ్‌రావుయాదవ్, రవీందర్‌గౌడ్, రమేష్‌యాదవ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రయాణికురాలి ల్యాప్‌టాప్ చోరీ

బర్కత్‌పుర, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికురాలి ల్యాప్‌టాప్‌ను దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. హస్తినాపురానికి చెందిన షేక్‌రహీసా విశాఖపట్నం వెళ్లడానికి కాచిగూడ రైల్వే స్టేషన్‌కు వచ్చింది. ఆమె ల్యాప్‌టాప్ బ్యాగు కనిపించలేదు. బుధవారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు.

బాలిక అదృశ్యం

బర్కత్‌పుర, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ నుంచి సొంతూరుకు వెళ్తున్న బాలిక అదృశ్యమైంది. కాచిగూడ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా వెంకటాపురం మండలం వెంగల్‌రావుపేట గ్రామానికి చెందిన రామకృష్ణ కుమార్తె శెట్టిపల్లి సుమన్య(17) బర్కత్‌పురలోని ఓ హాస్టల్‌లో ఉంటూ సీఏ చదువుతుంది. ఈ నెల 9న ఇంటికి వెళ్లడానికి హాస్టల్ నుంచి బయటకు వెళ్లిన సుమన్య అదృశ్యమైంది. ఇంటికి చేరకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు.. స్నేహితులు, బంధువుల ఇళ్లలో వెతికారు. అయినా బాలిక ఆచూకీ లభించలేదు. బాలిక సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉంది. తండ్రి రామకృష్ణ బుధవారం కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | అంజిరెడ్డి : 99859 21362